సాక్షి నిర్మల్

శనివారం । 23 । సెప్టెంబర్ । 2023



గణపయ్య.. వెళ్లి రావయ్యా 9లో▸

గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజు కొన్ని ప్రాంతాల్లో నిమజ్జనం నిర్వహించారు. గణవయ్యను ఘనంగా గంగమ్మ ఒడికి చేర్చారు.

నేడు పేరెంట్స్ మీటింగ్

నిర్మల్‌రూరల్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం పేరెంట్స్ మీటింగ్ నిర్వహించాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. సమావేశంలో తల్లిదండ్రుల నుంచి తగిన సూచనలు, సలహాలు తీసుకోవా లని తెలిపారు. పాఠశాలల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, వసతులు, సౌకర్యాలు తెలిపి పాఠశాలల అభివృద్ధిలో వారిని భాగస్వాములను చేయాలని పేర్కొన్నారు. ఇంటింటా చదువుల పంట అనే యాప్‌ను తల్లిదండ్రులు డౌన్‌లోడ్ చేసుకునేలా చూడాలన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.5 /24.4

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. రుతుపవనాలు, తుపాను ప్రభావంతో చాలాచోట్ల జల్లులు కురుస్తాయి. ఒకటి రెండు చోట్ల మోస్తరు వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఫోన్లు అప్పగింత



ఫోన్ పొందిన వారితో ఎస్పీ ప్రవీణ్‌కుమార్..

నిర్మల్‌టౌన్: మొబైల్ ఫోన్ పోతే ఆందోళన వద్దని, ఫోన్ పోతే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో లేదా మీ సేవ ద్వారా ఫిర్యాదు చేయాలని ఎస్పీ ప్రవీణ్ కుమార్ సూచించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోగొట్టుకున్న 12 మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా గుర్తించి, స్వాధీనం చేసుకుని ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం బాధితులకు అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. పోయిన ఫోన్లను గుర్తించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం ఇప్పటికే పలు రకాల సాంకేతిక అంశాలను ఉపయోగిస్తుందని తెలిపారు. అయితే టెలికాం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కొత్తగా ప్రవేశ పెట్టిన సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) అనే అప్లికేషన్ పోయిన ఫోన్‌ను పట్టుకునేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఐటీ కోర్ ఇన్‌చార్జి రవికుమార్, వివిధ పోలీస్ స్టేషన్లకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల తనిఖీ



మాట్లాడుతున్న డీఐఈవో పరశురాం

సారంగపూర్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి జె.పరశురాం శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా కళాశాల రికార్డులను పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. విద్యాబోధన తీరును తెలుసుకున్నారు. విద్యార్థులను పలు అంశాలపై ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం కళాశాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతం తగ్గకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ మారుతి, సిబ్బంది ఉన్నారు.

మామడ జూనియర్ కళాశాల..

మామడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈవో పరశురాం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, విద్యార్థుల హాజరుశాతం పెంచాలని, సకాలంలో సిలబస్ పూర్తిచేయాలని అధ్యాపకులకు సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ రవిచంద్రకుమార్, అధ్యాపకులు ఉన్నారు.

రచనలకు ఆహ్వానం

భైంసాటౌన్: తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా సమగ్ర సారస్వానికి వివిధ అంశాలపై రచనలు ఆహ్వానిస్తున్నట్లు భైంసా డివిజన్ కోకన్వీనర్ జాదవ్ పుండలిక్ రావు పాటిల్ తెలిపారు. చరిత్ర, సంస్కృతి–కళలు, భౌగోళిక పరిస్థితులపై రచనలు చేయాలని సూచించారు. ఆసక్తి గల రచయితలు 94413 33315, 985742274, 98492 47244 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

బల్దియాల్లో దోమల మోత!



- అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ
- ఓపెన్ ప్లాట్లు దోమలకు ఆవాసాలు
- మురికి కూపాలను తలపిస్తున్న మున్సిపాలిటీలు
- మచ్చుకైనా కానరాని ఫాగింగ్..
- ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నా పట్టించుకోని అధికారులు

జిల్లాలో మున్సిపాలిటీలు మురికి కూపాలను తలపిస్తున్నాయి. స్వచ్ఛత మచ్చుకైనా కానరావడం లేదు. అస్తవ్యస్త డ్రెయినేజీ, ఖాళీ ప్లాట్లలో నీటి నిల్వలు, మొక్కుబడి పారిశుధ్య పనులతో దోమలు వృద్ధి చెంది విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. పారిశుధ్యం మెరుగు పర్చి.. దోమల నివారణ చర్యలు చేపట్టాల్సిన బల్దియా అధికారులు, పాలకులు మొక్కుబడి చర్యలతో మమ అనిపిస్తున్నారు. జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల్లో పారిశుధ్య పరిస్థితిపై 'సాక్షి' శుక్రవారం పలు వార్డుల్లో పర్యటించింది. ఈ సందర్భంగా ఎటు చూసినా అస్తవ్యస్త డ్రెయినేజీలు, నిలిచిన మురుగునీరు, పేరుకుపోయిన చెత్తాచెదారం దర్శనమిచ్చాయి.

సాక్షి ఫోకస్



శ్రీనగర్ కాలనీలోని రోడ్డుపై వర్షపు నీరు



బాగులవాడలో డ్రెయినేజీలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు



ప్రియదర్శిని నగర్‌లో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు నీరు

నిర్మల్‌లో కానరాని పరిశుభ్రత

నిర్మల్‌టౌన్: నిర్మల్ మున్సిపాలిటీలోని వార్డులు సమస్యలకు నిలయంగా మారాయి. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడం, ఇష్టానుసారంగా చెత్తాచెదారం పడేయడంతో శుభ్రత కరువైంది. దీంతో దోమలు పెరిగి నిత్యం వందల మంది వాటి కాటుతో జ్వరాల బారిన పడుతున్నారు. అయినా అధికారులు మాత్రం పారిశుధ్యంపై దృష్టిపెట్టడం లేదు. ఇళ్ల మధ్యలోనే నిలిచిన మురుగునీటితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దుర్గంధంతోపాటు దోమలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయి.

ఎటు చూసినా పిచ్చి మొక్కలే..

పట్టణంలోని ప్రధాన వీధులైన ప్రియదర్శినినగర్, సాగర్ కాలనీ, శ్రీనగర్, రవినగర్, ఆదర్శ్ నగర్, ఎన్టీఆర్‌మార్గ్ , దివ్య నగర్, ఇంద్రనగర్, శాస్త్రినగర్, బాగులవాడ, బస్టాండ్ ప్రాంతంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఖాళీ ప్లాట్లలో పిచ్చి మొక్కలు పెరిగాయి. నిలిచిన వర్షపు నీటితో ఖాళీ స్థలాలు చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. చెత్త ఖాళీ ప్లాట్లలో వేయడంతో దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. పాములు, విష పురుగులు సంచరిస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

నిర్మల్ పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కొన్నిచోట్ల చిరు వ్యాపారులు డ్రైనేజీని ఆక్రమించారు. కాలువల్లో పూడిక, చెత్త సక్రమంగా తొలగించకపోవడంతో మురుగు నీరు రోడ్లపై పారుతోంది. ప్రియదర్శని నగర్, శ్రీనగర్ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. డ్రైనేజీలు, కందకాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం పేరుకుపోయాయి.

దోమల నివారణకు చర్యలేవి?

వర్షాకాలం మొదలై రెండు నెలలు గడుస్తున్నా, విషజ్వరాలు విజృంభిస్తున్నా దోమల నివారణకు మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దోమల మందు స్ప్రే, శానిటైజన్, ఫాగింగ్ మచ్చుకైనా కనిపించడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు నివాసముండే కాలనీల్లోనే ఫాగింగ్, దోమల నివారణ మందు స్ప్రే చేస్తున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

రోగాలబారిన పడుతున్నాం



ప్రస్తుతం పట్టణ ప్రజల జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. దోమల నివారణకు, కందకాలు, డ్రైనేజీలు శుభ్రంగా ఉండేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి. ఖాళీ ప్లాట్లలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను తొలగించాలి. దోమల నివారణ మందు స్ప్రే చేయించాలి.

– ఊరే స్వామి(ప్రియదర్శిని నగర్ కాలనీ)

చర్యలు తీసుకుంటాం

వర్షాకాలం మొదలైన నుండి డ్రైనేజీల పక్కన సానిటేషన్ చేస్తున్నాం. వర్షాకాలం కాబట్టి పిచ్చి మొక్కలు పేరుకుపోయాయి. వాటిని కూడా తొలగిస్తాం. ప్రజలు జ్వరాల బారిన పడకుండా దోమల స్ప్రే కూడా కొడతాం. అన్ని రకాల చర్యలు తీసుకుంటాం.

– దేవీదాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

భైంసాలో శివారు కాలనీలపై చిన్నచూపు..



గోపాల్‌నగర్‌లో డ్రెయినేజీ పరిస్థితి..

భైంసాటౌన్: భైంసా పట్టణంలో పారిశుధ్య నిర్వహణ కొంత మెరుగ్గానే ఉన్నా.. శివారు కాలనీల్లో మాత్రం అధ్వాన్నంగా ఉంది. ఏపీ నగర్, గోపాల్‌నగర్, ఎన్‌బీ కాలనీ, సుభాష్‌నగర్, పిప్రి, తదితర కాలనీల్లో సీసీ డ్రెయినేజీలు లేక ఇళ్ల మధ్య నుంచే మురుగు నీరు పారుతోంది. దోమల బెడదతోపాటు నివాసాల మధ్యనే పందుల సంచారంతో కాలనీవాసులు వ్యాధుల బారిన పడుతున్నారు. రాహుల్‌నగర్, భాగ్యలక్ష్మినగర్, ఇతర నూతన కాలనీల్లోని ఖాళీస్థలాల్లో నీరు నిలిచి, పిచ్చిమొక్కలతో దోమలు, పందులకు ఆవాసంగా మారుతున్నాయి.

పట్టించుకున్నవారే లేరు...



మా కాలనీలో కనీసం చెత్త తొలగించేందుకు కూడా ఎవరూ రావడం లేదు. సీసీ డ్రెయినేజీలు, రోడ్లు లేవు. పందులు చనిపోతే తీసుకెళ్లేందుకు కూడా ఎవరూ రారు. మా సమస్యల గురించి పట్టించుకున్నవారే లేరు. పందులు, దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. దుర్గంధం మధ్యనే వెళ్లదీస్తున్నాం.

– లావణ్య, గోపాల్‌నగర్‌వాసి, భైంసా

చర్యలు తీసుకుంటున్నాం...

డ్రెయినేజీల్లో క్రమం తప్పకుండా పూడిక తీయిస్తున్నాం. మురుగునీటి కాలువల్లో యాంటీ లార్వా స్ప్రే చేయిస్తున్నాం. ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండకుండా జేసీబీతో కచ్చా కాల్వలు తవ్విస్తున్నాం. మురుగునీటి గుంటల్లో ఆయిల్ బాల్స్ వేయిస్తున్నాం. శివారు కాలనీల్లో సమస్య ఉన్న మాట వాస్తవమే. సీసీ డ్రెయిన్లు, రోడ్లు లేక ఇబ్బంది ఏర్పడుతోంది.

– వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్, భైంసా

ఖానాపూర్‌లో పడకేసిన పారిశుధ్యం..



ఖానాపూర్‌లో అస్తవ్యస్తంగా డ్రెయినేజీ, చెత్తచెదారం..

ఖానాపూర్: ఖానాపూర్ పట్టణంలో పారిశుధ్యం పడకేసింది. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పేరుకే పట్టణమైన ఖానాపూర్‌లో నూతన పాలకవర్గం ఏర్పడ్డ నాటి నుంచి ఒకటి రెండు మినహా ఎక్కడా నూతన డ్రైనేజీలు నిర్మించలేదు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే పట్టణంలోని రోడ్లు కుంటలను తలపిస్తాయి. కాలనీలు జలమయమవుతున్నాయి. ఇంత తీవ్రమైన పరిస్థితులు ఉన్నా పాలకులు పట్టించుకోవడం లేదు. పట్టణంలోని మురుగు నీరంతా కప్పలకుంట చెరువులోకి చేరుతోంది. ఇక జనావాసాల్లో చెత్తచెదారం తొలగించడం లేదు. మురికి నీటి గుంతల్లో దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవడం లేదు. పట్టణ శివారులో చెత్తచెదారంతోపాటు చికెన్, మటన్ వ్యర్థాలు, చనిపోయిన పందులు, కుక్కల కళేబరాలు వేస్తున్నారు. రోడ్డు వెంట వెళ్లే హనదారులతోపాటు పలు కాలనీల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

దోమల మోత..

పారిశుధ్య లోపంతో పట్టణంలో దోమల మోత పెరిగింది. దోమ కాటుతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పారిశుధ్య లోపంతోపాటు తాగు నీటి పైపులైన్ల లీకేజీతో కలుషిత నీరే సరఫరా అవుతోంది. అనారోగ్యానికి తాగునీరు కూడా కారణమవుతోంది. ఈవిషయమై పలువురు కౌన్సిలర్‌లు అనేకసార్లు ఆందోళనలు చేసినా సమస్య పరిష్కారానికి అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవడం లేదు.



పూడిక తీస్తున్న పారిశుధ్య సిబ్బంది

ముందస్తు చర్యలు చేపడుతున్నాం

పట్టణంలో పారిశుధ్య పనులు చేపడుతున్నాం. డ్రెయినేజీల్లో పూడిక తీయించడంతోపాటు ఫాగింగ్ చేయిస్తున్నాం. అవసరమైన చోట్ల ఆయిల్ బాల్స్ వేస్తున్నాం. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో డ్రైడే ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఇటీవల మున్సిపాలిటీకి వచ్చిన రూ.25 కోట్ల నుంచి రూ.14 కోట్లతో డ్రైనేజీల నిర్మాణం, సీసీ రోడ్ల కోసం కేటాయించాం.

మనోహర్,
మున్సిపల్ కమిషనర్, ఖానాపూర్

గ్రామీణాభివృద్ధే ప్రగతికి పునాది

- అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలి
- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- సాదాసీదాగా జెడ్పీ సర్వసభ్య సమావేశం



జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కలెక్టర్

నిర్మల్ రూరల్: గ్రామీణ అభివృద్ధి జిల్లా ప్రగతికి పునాది అని, అధికారులు, ప్రజాప్రతినిధులు పల్లెల ప్రగతికి సమష్టిగా పని చేయాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్స్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్యసమావేశం జరిగింది. మంత్రి ఐకేరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కడెం ఎంపీపీ అలెగ్జాండర్ మాట్లాడుతూ జిల్లాకు మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా ఎన్ని కుట్టు మిషన్లు ఇచ్చారో ప్రజాప్రతినిధులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని కోరారు. సోన్ జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నందు, గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని కోరారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే దేశంలో ఏ రాష్ట్రంలో లేనటువంటి జీతభత్యాలు ఇస్తున్నామన్నారు. గర్భిణీలు, పిల్లలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అంగన్‌వాడీల సమస్యలను మంత్రి ఐకేరెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలకు భారీ వరదలు వచ్చిన పొలాల్లో ఇసుకమేటలు వేసిందని, వాటిని తొలగించేలా చూడాలని కోరారు. ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి కూడా పంట పొలాల్లో ఇసుకమేటలు తొలగించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియడంలేదని లక్ష్మణచాంద జెడ్పీటీసీ రాజేశ్వర్ సభలో ప్రస్తావించారు. రైతులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు.

ప్రగతిని వివరించిన మంత్రి..

అనంతరం మంత్రి మాట్లాడుతూ జిల్లా ప్రగతిని వివరించారు. మెడికల్ కాలేజీతో జిల్లా ప్రగతి మరింత పెరిగిందన్నారు. ఇప్పటికే 100 సీట్లు భర్తీ అయ్యాయని, ఈనెల 25 నుండి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. సోన్ మండలంలోని పాక్‌పట్లలో నిర్మించే ఆయిల్‌పాం పరిశ్రమకు ఈనెల 25న మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేస్తారని తెలిపారు. లోకేశ్వరం మండలం అర్లీ వద్ద గోదావరి నదిపై కొత్త బ్రిడ్జి కోసం ప్రభుత్వం రూ.46 కోట్లు కేటాయించిందని, ఇప్పటికే టెండర్లు కూడా పూర్తయ్యాయని దసరా తర్వాత పనులు మొదలు పెడతారన్నారు. ఆసరా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను గుర్తించి ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో 1,27,000 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దసరా నుంచి అల్పాహారం అందిస్తామన్నారు. చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేశారు.

రేఖానాయక్ గైర్హాజర్..

ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ జెడ్పీ సమావేశానికి గైర్హాజర్ అయ్యారు. ఇటీవల నిధుల విడుదలపై, సొంత పార్టీ నేతలపై బాహాటంగా విమర్శలు చేసిన ఎమ్మెల్యే సమావేశానికి వచ్చి గళమెత్తే అవకాశం ఉన్నా గైర్హాజరు కావడం చర్చకు దారితీసింది. సమావేశం రివరన ముధోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి మాట్లాడుతూ.. దేవుడిదయ, ఆశీస్సులు ఉంటే మళ్లీ గెలిచి వచ్చే జెడ్పీ సమావేశానికి హాజరవుతానని పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ దండే విఠల్, జెడ్పీ సీఈవో సుధీర్ కుమార్, డీసీఎంఎస్ చైర్మన్ లింగయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి విస్తృత ఏర్పాట్లు


- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఐకేరెడ్డి, వేదికపై కలెక్టర్, జెడ్పీ చైర్ పర్సన్

నిర్మల్‌టౌన్: గణేశ్ నిమజ్జనానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్కే కన్వెన్షన్ హాల్‌లో గణేశ్ మండపాల నిర్వాహకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి హాజరై మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జన శోభాయాత్రను జరుపుకోవాలని సూచించారు. పట్టణంలో ప్రమాదాలు, అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్, రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్ అధికారులు కలిసి పనిచేయాలన్నారు. 5, 7, 9, 11, 13, 15 రోజులలో నిర్వహించే నిమజ్జన శోభాయాత్రకు వెళ్లే మార్గంలో బారికేడ్లు, పోలీసుల బందోబస్తు, వినాయక సాగర్ వద్ద క్రేన్లు, గజ ఈతగాళ్లు అన్నిరకాల ఏర్పాట్లను అధికారులు సిద్ధంగా చేశారన్నారు. యువత సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ మెసేజ్‌లు నమ్మి తొందర పడవద్దన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఫేక్ సమాచారం వస్తే పోలీసులను సంప్రదించాలని సూచించారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. నిర్మల్ పట్టణంలో మంచి సంప్రదాయం ఉందని, గణపతులు నంబర్ ప్రకారం..వరుసలో నిమజ్జనానికి తీసుకెళ్లాలని తెలిపారు. అన్ని మండపాల నిర్వాహకులు సమన్వయంతో నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించేలా సహకరించాలని కోరారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, పట్టణ సీఐ పురుషోత్తం, పట్టణ గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు, కౌన్సిలర్లు, గణేశ్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన ర్యాలీ



ర్యాలీలో మధ్యాహ్న భోజన కార్మికులు

నిర్మల్‌చైన్‌గేట్: పెంచిన వేతనాలతోపాటు పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు శుక్రవారం నిరసన తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు భూక్య రమేశ్ మాట్లాడుతూ కార్మికులకు ఉద్యోగ భద్రతతోపాటు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా ఒక్కో విద్యార్థికి రూ.25 ఇవ్వాలని, సిలిండర్ గ్యాస్, నిత్యావసర సరుకులు, కోడి గుడ్లు ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. పాఠశాలలో వంట పాత్రలు, వంట షెడ్లు లేక ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికుల అక్రమ తొలగింపు అరికట్టాలన్నారు. ప్రతీనెల 5వ తేదీన వేతనాలు, బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అమృత, పావని, ఉమ, మైసవ్వ, లక్ష్మీ, సాయవ్వ, కవిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేలల్లో అభ్యర్థులు.. పదుల్లో పోస్టులు..!

- నిరాశలో బీఈడీ, డీఈడీ అభ్యర్థులు

భైంసాటౌన్: ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ప్రకటించిన ఖాళీలతో జిల్లాలో అభ్యర్థుల పరిస్థితి అయోమయంగా మారింది. కొలువుల కోసం వేలల్లో అభ్యర్థులు ఏళ్లుగా ఎదురుచూస్తుండగా, ప్రభుత్వం ప్రకటించిన ఖాళీలు పదుల సంఖ్యలో ఉండడంతో నిరాశ నెలకొంది. మొత్తం 115 ఉపాధ్యాయ ఖాళీలను ప్రకటించగా, ఇటీవల టెట్‌కు హాజరైన అభ్యర్థులు 12 వేలకుపైగా ఉన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఖాళీల్లో కొన్ని పోస్టులు ఒక్క ఖాళీ లేక పోగా, మరికొన్ని ఒకటి, రెండు పోస్టులే ఉన్నాయి. దీంతో బీఈడీ అభ్యర్థులు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఈ నేపథ్యంలో శనివారం పాత కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేపట్టనున్నట్లు తెలిసింది.

జిల్లాలో ఇలా..

జిల్లాలో ఎస్ఏ తెలుగు 4, హిందీ 4, గణితం (ఉర్దూ మీడియం) 1, సోషల్ స్టడీస్(ఉర్దూ మీడియం) 1, బయోసైన్స్ తెలుగు మీడియం 5, ఎస్ఏ ఉర్దూ 1 మొత్తం సబ్జెక్టులవారీగా ఎస్ఏ పోస్టులు కేవలం 16 ఉన్నాయి. ఎస్జీటీ తెలుగు మీడియం 50, ఉర్దూ మీడియం 37 ఉన్నాయి. భాషాపండిట్ హిందీ 1, మరాఠీ 2, ఉర్దూ 1, పీఈటీ పోస్టులు 4 ఉన్నాయి.

రోస్టర్ వారీగా ఇలా...

ఇక, మొత్తం 115 పోస్టులకు సంబంధించి రోస్టర్‌ను ప్రకటించారు. ఓసీ విభాగంలో జనరల్ 21, మహిళ 24, ఎస్సీ విభాగంలో జనరల్ 10, మహిళ 13, ఎస్టీ విభాగంలో జనరల్ 5, మహిళ 5, దివ్యాంగుల విభాగంలో జనరల్ 1, మహిళ 4, ఈడబ్ల్యూఎస్ విభాగంలో జనరల్ 5, మహిళ 2, మాజీ సైనిక విభాగంలో 3 ఖాళీలు ఉన్నాయి. బీసీ ఏ విభాగంలో జనరల్ 3, మహిళ 7, బీసీ బీ విభాగంలో జనరల్ 3, మహిళ 3, బీసీ సీ విభాగంలో జనరల్ 2, బీసీ డీ విభాగంలో మహిళ 2, బీసీ ఈ విభాగంలో మహిళ 2 పోస్టులు ఖాళీలు ప్రకటించింది.

ఇంగ్లిష్, గణితం, ఫిజికల్ సైన్స్ పోస్టులేవి..?

జిల్లాలో కొన్ని సబ్జెక్టులకు ఒక్క ఖాళీ లేకపోవడం గమనార్హం. ఎస్ఏ విభాగంలో తెలుగు మీడియంలో ఇంగ్లిష్, గణితం, ఫిజికల్ సైన్స్ పోస్టులు లేవు. దీంతో ఆయా సబ్జెక్టు అభ్యర్థులు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఏళ్లుగా ఎదురు చూస్తున్న తమకు నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

ఖేలో ఇండియా పోటీల్లో ప్రతిభ

ఆదిలాబాద్‌: హన్మకొండలో జరిగిన ఖేలో ఇండియా ఉమెన్స్‌ అథ్లెటిక్స్‌ చాంపియన్‌షిప్‌ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు తమ ప్రతిభను చాటారు. ట్రిపుల్‌ జంప్‌ పోటీల్లో వసంత, రజత పతకాన్ని సాధించగా, మూడు వేల మీటర్ల పరుగు పందెంలో మనిషా కాంస్య పతకంతో మెరిసింది. క్రీడాకారులతో శిక్షకులు రాకేష్‌, రాహుల్‌, రజిని ఉన్నారు. అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అడ్డి బోజారెడ్డి, రాజేష్‌, ఒలంపిక్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు గోవర్దన్‌ రెడ్డి, పెటా అధ్యక్ష, కార్యదర్శులు పార్థసారథి, స్వామి క్రీడాకారులను అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినులతో ప్రిన్సిపల్‌ అనిత

ఆదిలాబాద్‌టౌన్‌: రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్‌ అండ్‌ కామర్స్‌ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపల్‌ జలగం అనిత శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల హన్మకొండలో జరిగిన రాష్ట్రస్థాయి ఉమెన్స్‌ లీగ్‌ అథ్లెంటిక్స్‌ చాంపియన్‌షిప్‌ పోటీల్లో కళాశాలకు చెందిన విద్యార్థినులు వసంత ట్రిపుల్‌ జంప్‌ విభాగంలో రజత పతకాన్ని సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా డిస్కత్రోలో జ్యోతి, శ్రీజ, లాంగ్‌ జంప్‌లో అంజలి పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో లెక్చరర్లు కోటయ్య, గణపతి, ప్రభాత్‌రావు, చంద్రకాంత్‌, నరేష్‌ పాల్గొన్నారు.

24న సత్యశోధక స్థాపన దినోత్సవం

ఆదిలాబాద్‌రూరల్‌: ఈ నెల 24న సత్యశోధక స్థాపన దినోత్సవాన్ని ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా వ్యాప్తంగా నిర్వహించుకోవాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్‌ పేట్కులే, జిల్లా అధ్యక్షుడు విజయ్‌ వాడగురే తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అఖిల భారతీయ మాలీ మహా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహాత్మాజ్యోతిరావు పూలే దంపతులు 24 సెప్టెంబర్‌ 1873న సత్యశోధక సమాజాన్ని స్థాపించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నేతలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

ఆదిలాబాద్‌రూరల్‌: మండలంలోని బాలాజీ గార్డెన్‌ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనగా ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని చనాఖా గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు జిల్లా కేంద్రంలోని వినాయక విగ్రహాలను దర్శించుకునేందుకు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన మరో గుర్తు తెలియని వాహనం వీరి బైక్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో చనాఖా గ్రామానికి చెందిన మెట్‌పల్లి సాయిచరణ్‌, ఉత్తర్వార్‌ సంకేట్‌లకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి 108లో రిమ్స్‌ ఆస్పత్రికి తరలించారు.

ఆటో బోల్తా పడి..

ఆటో బోల్తాపడిన సంఘటనలో పలువురికి గాయాలయ్యాయి. బాధితుల కథనం ప్రకారం.. బేల మండల కేంద్రం నుంచి ఆదిలాబాద్‌కు ఆటో ప్రయాణికులతో బయలుదేరింది. తిర్పెల్లి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బేలకు చెందిన వృద్ధుడు గంగాధర్‌, ఏఎన్‌ఎం స్వర్ణలత, పట్టణంలోని సుభాష్‌నగర్‌ కాలనీకి చెందిన దస్తగిరితో పాటు మరో వ్యక్తికి తీవ్రగాయాలు కాగా మరికొంత మందికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రస్తుతం తీవ్ర గాయాలపాలైన వారు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం రిమ్స్‌ పోలీసులు వన్‌ టౌన్‌ పోలీసులకు తెలియజేశారు.



గణేశ్‌నగర్‌లో..



కిసాన్‌గల్లీలో..

విభిన్నరూపాల్లో విఘ్నేశుడు..

భైంసాటౌన్‌: గణేశ్‌ నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని భైంసా పట్టణంలోని ఆయా కాలనీల్లో మండలి నిర్వాహకులు ఏర్పాటు చేసిన మండపాల్లో కొలువుదీరిన గణనాథుడు భక్తుల పూజలందుకుంటున్నాడు. ఆకర్షనీయమైన సెట్టింగులు వేసి, వివిధ రూపాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ఉదయం, సాయంత్రం వేళల్లో పూజలు నిర్వహిస్తున్నారు. ఓంకార్‌ యూత్‌ ఆధ్వర్యంలో ప్రతిరోజు అన్నదానం చేస్తున్నారు.



మార్వాడిగల్లిలోని రాధాకృష్ణ భవన్‌ వద్ద సుఖ్‌దేవ్‌ యూత్‌ గణపతి



కిసాన్‌గల్లీలో..



మేదరిగల్లిలో..



పురాణాబజార్‌లోని మోచి సంఘం ఆధ్వర్యంలో..

పల్లె దవాఖానలకు 'ఎన్‌క్వాస్‌'

- వైద్య సేవలకు వరించిన పురస్కారం
- భీంపూర్‌ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో మూడు ఉపకేంద్రాల ఎంపిక
- మూడేళ్లపాటు ఏడాదికి రూ.1.25లక్షల చొప్పున నిధులు
- రాష్ట్రంలో ఎంపికైన ఏకైక ఉపకేంద్రాలు



అందర్‌బంద్‌ పల్లె దవాఖాన వద్ద ఢిల్లీ బృందం సభ్యులతో వైద్యసిబ్బంది

తాంసి: భీంపూర్‌ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. ఆరోగ్య కేంద్రం ద్వారా అందిస్తున్న వైద్య సేవలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వరుసగా పురస్కారాలు సైతం ప్రకటిస్తున్నాయి. దీంతో జిల్లాలోనే మొదటగా 2017, 2021లోనూ ఎన్‌క్వాస్‌(నేషనల్‌ క్వాలిటీ అస్యూరెన్స్‌ స్టాండర్స్‌) గుర్తింపు పొందింది. ఈ ఆరోగ్య కేంద్రం పరిధిలోని అందర్‌బంద్‌, అర్లి(టి), ధనోర పల్లె దవాఖానలకు (ఆరోగ్య ఉప కేంద్రాలకు) సైతం రాష్ట్రంలోనే మొదటిసారిగా ఎన్‌క్వాస్‌ గుర్తింపు లభించింది.

పల్లె దవాఖానాలకు ఎన్‌క్వాస్‌ గుర్తింపు...

జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల (ఎన్‌క్వాస్‌) గుర్తింపు ఇదివరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మాత్రమే పురస్కారం అందించేవారు. కానీ ప్రస్తుతం ఆరోగ్య కేంద్రాల పరిధిలో పనిచేస్తున్న ఆరోగ్య ఉపకేంద్రాలకు సైతం ఎన్‌క్వాస్‌ గుర్తింపు ఇస్తున్నారు. దీనిలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో మొదటగా ఆదిలాబాద్‌ జిల్లాలోని భీంపూర్‌ ఆరోగ్య కేంద్రం పరిధిలోని మూడు పల్లె దవాఖానలు ఎన్‌క్వాస్‌ గుర్తింపు సాధించాయి. దీంతో ప్రతీ ఏడాది ఒక్కో పల్లెదవాఖానాకు రూ.1.25లక్షల చొప్పున మూడేళ్ల పాటు అందించనుంది.

ప్రజలకు మెరుగైన వైద్యం



గతంలో గ్రామాల్లో ప్రజలు రోగాలు, వ్యాధులు సంభవిస్తే గ్రామస్తులు ఆర్‌ఎంపీలు లేదా ప్రైవేట్‌ ఆస్పత్రులను ఆశ్రయించేవారు. ప్రస్తుతం ఆరోగ్య ఉపకేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం. ఉప కేంద్రంలో ఉండే వవతులతో పాటు అందించే వైద్య సేవలను ప్రజలకు తెలియజేశాం. ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కలిగే విధంగా వైద్యం చేస్తాం.

– దివ్య, ఎంఎల్‌ఎస్‌పీ పల్లె దవాఖానా అర్లి(టి)

అవగాహన కలిస్తున్నాం



ఆరోగ్య కేంద్రంతో పాటు పల్లె దవాఖానాలో అందించే అన్ని రకాల వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. పల్లె దవాఖానాలో పూర్తిస్థాయి వైద్యం అందే విధంగా వైద్యాధికారితో టెలిమెడిసిన్‌తో వివిధ రకాల పరీక్షలు నిర్వహించి వైద్యం అందిస్తున్నాం. ఆరోగ్య సేవలు వినియోగించుకోవాలి.

– లింగంపెల్లి జ్ఞానేశ్వర్‌, హెచ్‌ఈవో, భీంపూర్‌ ఆరోగ్య కేంద్రం

వైద్యం బాగుంది..



మా గ్రామంలోని పల్లె దవాఖానాలో అందించే మందులు వాడుతున్నాను. కాళ్ల నొప్పుల తో పాటు దీర్ఘకాలిక వ్యాధులు బీపీ ఎక్కువగా ఉంది. దీంతో గ్రామంలోని పల్లె దవాఖానాకు వెళ్లి పరీక్షలు చేసుకుంటున్నాను. వైద్య సిబ్బంది పూర్తిస్థాయిలో పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు. గతంలో మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది.

– వాగాడే నారాయణ, అందర్‌బంద్‌ గ్రామం

పురస్కారం మరింత బాధ్యతను పెంచింది



మా ఆరోగ్య కేంద్రానికి ఇప్పటికే రెండు సార్లు ఎన్‌క్వాస్‌ పురస్కారంతో పాటు కాయకల్ప అవార్డు సైతం వచ్చింది. ప్రస్తుతం ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న పల్లె దవాఖానాలకు రాష్ట్రంలోనే మొదటగా ఎన్‌క్వాస్‌ గుర్తింపు రావడం చాలా సంతోషంగా ఉంది. మా ఆరోగ్య కేంద్రం సిబ్బంది కృషి జిల్లా ఉన్నతాధికారుల సహకారంతో పురస్కారం సాధించాం.

– విజయసారథి, వైద్యాధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, భీంపూర్‌

12 మంది బైండోవర్‌

మామడ: మండలంలోని దిమ్మదుర్తి, కమల్‌కోట్‌, తోటిగూడ, జగదాంబతండా, న్యూలింగంపల్లి, అనంతపేట్‌, ఆదర్శనగర్‌, నల్దుర్తి, చందారం, తాండ్ర గ్రామాలకు చెందిన 12మందిని శుక్రవారం తహసీల్దార్‌ ఎదుట బైండోవర్‌ చేసినట్లు ఎక్సైజ్‌ ఎస్సై రాయబారపు రవికుమార్‌ తెలిపారు. గతంలో వీరిపై ఎక్సైజ్‌ కేసులు ఉండడంతో బైండోవర్‌ చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్‌ సిబ్బంది నరెందర్‌, ప్రకాష్‌, వెంకటేష్‌ ఉన్నారు.

జ్వరంతో బాలిక మృతి

బోథ్‌: మండలంలోని కౌఠ (బి) గ్రామానికి చెందిన నివేదిత(13) జ్వరంతో మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. నివేదిత మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. బోథ్‌లోని సీహెచ్‌సీకి తీసుకెళ్లినా నయం కాలేదు. దీంతో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది.

నేడు చెస్‌ పోటీలు

మందమర్రిరూరల్‌: మందమర్రి పట్టణంలోని లిటిల్‌ఫ్లవర్‌ పాఠశాల ఆవరణలో శనివారం ఉమ్మడి జిల్లా ఓపెన్‌ టూ ఆల్‌ చెస్‌ పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా చెస్‌ చైర్మన్‌ కనకయ్య శుక్రవారం తెలిపారు. క్రీడాకారులు ఉదయం 9గంటలకు పాఠశాలకు చేరుకుని పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

24న 'ఉదారి' పురస్కారం అందజేత

ఆదిలాబాద్‌: ప్రముఖ తత్వకవి ఉదారి నాగదాసు స్మారక సాహిత్య పురస్కారాన్ని 2023కు నల్గొండ జిల్లాకు చెందిన ప్రముఖ కవి, విమర్శకుడు ఏనుగు నరసింహారెడ్డికి ఈ నెల 24న ప్రదానం చేయనున్నట్లు జిల్లా కవి ఉదారి నారాయణ శుక్రవారం తెలిపారు. ఈ అవార్డు కింద రూ.5000 నగదు పురస్కారం, ప్రశంస పత్రాన్ని అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

పౌష్టికాహారం అందించడం బాధ్యత

- ఐటీడీఏ పీవో చాహత్‌ బాజ్‌పాయ్‌



ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న పీవో

ఉట్నూర్‌రూరల్‌: గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం కుటుంబ సభ్యులు బాధ్యతగా తీసుకోవాలని ఐటీడీఏ పీవో చాహత్‌ బాజ్‌పాయ్‌ సూచించారు. మండలంలోని గురువారం చిన్నుగూడ గ్రామానికి చెందిన ఆత్రం భీంబాయికి పురిటినొప్పులు రావడంతో వర్షంలో ప్రసవించి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే.. కాగా ఈ విషయం తెలుసుకున్న ఐటీడీఏ పీవో శుక్రవారం స్థానిక జిల్లా ఆస్పత్రికి చేరుకుని భీంబాయి ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంలో ప్రభుత్వం బాధ్యతగా ఉంటున్నప్పటికీ కుటుంబ సభ్యులు సైతం బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రసవ సమయంలో మహిళలను వారం రోజుల ముందుగానే ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి సుఖ ప్రసవం చేయించుకోవాలని సూచించారు. వైద్యులు మహేందర్‌, శ్వేత, నర్సింగ్‌ సూపరింటెండెంట్‌ విమల, స్టాఫ్‌ నర్సు శ్రీలత ఉన్నారు.

గిరిజన క్రీడోత్సవాలు పకడ్బందీగా నిర్వహించాలి

ఉట్నూర్‌రూరల్‌: జిల్లాలోని గిరిజన విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు గిరిజన క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటి డైరెక్టర్‌ డాక్టర్‌ ఎం.దిలీప్‌కుమార్‌ అన్నారు. శుక్రవారం స్థానిక కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ భవనంలో ఐటీడీఏ శాఖలోని అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. గత ఏడాది నిర్వహించిన గిరిజన క్రీడోత్సవాల్లో ఉట్నూర్‌ ఐటీడీఏ రెండవ స్థానంలో నిలవడం అభినందనీయమని, ఈసారి ప్రథమ స్థానంలో నిలిపేలా అందరూ కృషి చేయాలని కోరారు. ఆదిలాబాద్‌ డివిజన్‌ స్థాయి పోటీలు ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో, బోథ్‌ డివిజన్‌ స్థాయి పోటీలు జాతర్ల క్రీడా పాఠశాల మైదానంలో, ఉట్నూర్‌ డివిజన్‌ స్థాయి పోటీలు స్థానిక కేబీ కాంప్లెక్స్‌ మైదానంలో, నిర్మల్‌ డివిజన్‌ స్థాయి పోటీలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈ నెల 29న నిర్వహించనున్నట్లు తెలిపారు. జోనల్‌స్థాయి పోటీలు అక్టోబర్‌ 3,4 తేదీల్లో ఉట్నూర్‌ క్రీడా పాఠశాల మైదానంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారధి, ఏసీఎంవో జగన్‌, ఏటీడీవోలు క్రాంతి, సౌజన్య, నిహారిక, పీడీలు రమేష్‌, హేమంత్‌, మధుసూదన్‌, తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలపై ఫిర్యాదు

ఖానాపూర్‌: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బి.రాజు అనే వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బన్సిలాల్‌ రాథోడ్‌ డిమాండ్‌ చేశారు. శుక్రవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు కుక్కరికారి రాజేశ్‌, జిల్లా చేరికల కమిటీ ఇన్‌చార్జి నేర రాజన్న, గిరిజన సేన రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్‌, నాయకులు సతీశ్‌ ఉన్నారు.

పోలీసులపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ చైర్మన్‌కు ఫిర్యాదు

ఎదులాపురం: అంగన్‌వాడీ ఆదివాసీ, దళిత మహిళలపై దాడి చేసిన ఎస్సై, సీఐ, డీఎస్పీ తదితరులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేస్తూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్‌ అండ్‌ హెల్పర్స్‌ జేఏసీ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ చైర్మన్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఆదిలాబాద్‌ జిల్లా కలెక్టరేట్‌ ఎదుట ఈ నెల 20న చేపట్టిన నిరసనలో ఆదివాసీ దళిత అంగన్‌వాడీ ఉద్యోగులపై పోలీసులు దౌర్జన్యం చేయడమే కాకుండా, కులం పేరుతో దూషించి, కొట్టి గాయపర్చారని విన్నవించారు. పోలీసులే దాడి చేసి అంగన్‌వాడీ ఉద్యోగులపై కేసులు పెట్టి వేధిస్తున్నారని, పోలీసులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, ఉద్యోగులపై పెట్టిన కేసులు ఎత్తివేసేలా చర్యలు తీసుకుని రక్షణ కల్పించాలని వినతిపత్రం అందించారు. జేఏసీ నాయకురాలు పి.జయలక్ష్మి, ఎస్‌.కరుణకుమారి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్‌, ఈశ్వరరావు ఉన్నారు.

బోథ్‌ డివిజన్‌ కోసం మానవహారం

- నేటితో 70 రోజులకు దీక్షలు
- ఎన్నికలలోగా డివిజన్‌ చేయాలని డిమాండ్‌
- నేడు బోథ్‌ బంద్‌



దీక్షలో కూర్చున్న నాయకులు

బోథ్‌: బోథ్‌ను డివిజన్‌గా ప్రకటించాలని చేస్తున్న ఉద్యమం తీవ్రరూపం దాలుస్తోంది. డివిజన్‌ చేయాలని శనివారం బోథ్‌ బంద్‌కు బోథ్‌ డివిజన్‌ సాధన సమితి పిలుపునిచ్చింది. ఎన్నికలలోగా డివిజన్‌గా మార్చాలని ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. బోథ్‌ పట్టణంలో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. డివిజన్‌ ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్‌ పాఠశాల, కళాశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. శనివారం నిర్వహించనున్న బోథ్‌ బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. శనివారానికి దీక్షలు 70వ రోజుకు చేరుకుంటున్నాయని సాధన సమితి సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం దీక్షలో బీజేపీ నాయకులు కూర్చున్నారు. ఈ నెల 25వ తేదీన నిర్మల్‌ జిల్లా కేంద్రానికి వస్తున్న కేటీఆర్‌ బోథ్‌ను డివిజన్‌గా ప్రకటించాలని కోరారు.

కడెం ప్రాజెక్ట్‌ గేటు ఎత్తివేత



గేటు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న నీళ్లు

కడెం: కడెం ప్రాజెక్టుకు ఉదయం 7598 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో ప్రాజెక్ట్‌ అధికారులు ఒక వరద గేటు ఎత్తివేసి 5023 క్యూస్కెకుల నీటిని దిగువకు వదిలారు. ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టడంతో గేటు మూసివేశారు. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా ప్రస్తుతం 697.750 అడుగుల నీటి మట్టం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

భారీ వర్షానికి పొంగిన వాగులు



చిత్తగూడ రోడ్డుపై నుంచి పారుతున్న వరదనీరు

నార్నూర్‌: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. శుక్రవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి మండలంలోని దన్నుగూడ, బాబేఝరి, చిత్తగూడ, భారీక్‌రావుగూడ వాగుల్లోకి వరద నీరు చేరింది. చిత్తగూడ గ్రామం వద్ద రోడ్డుపై నుంచి వరదనీరు పొంగిపొర్లడంతో రోడ్డు కోతకు గురైంది. ప్రస్తుతం బాబేఝరి, మంత్రి, సుంగాపూర్‌, చోర్‌గావ్‌ గ్రామాలకు వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.